24

# శపథం

సింధు దేశంలో శ్రీకాంతుడనే రాజు ఉండేవాడు.

వేట అంటే అతనికి ఎంతో ఆసక్తి. ఒకసారి వేటకి పోయి జంతువులను తరుముతూ చాలాదూరం వెళ్లిపోయాడు. అలా వెళ్తుండగా ఒక అడవి పంది అతని కంటబడింది. దానిని తరుముకొంటూ వెళ్తుండగా అది సింధు నదిలోకి దూకింది. విచిత్రమేమిటంటే ... అది అడుగు పెట్టినచోట నది ఎండిపోసాగింది.

ఎండిన ఆ నదిలో తన అశ్వాన్ని పరిగెత్తిస్తూ అడవి పందిని వెంటాడసాగాడు శ్రీకాంతుడు. కొంత సేపటికి అది నదికి ఆవలి తీరాన్ని జేరి పారిపోసాగింది.

ఆ వింత పందిని సాధ్యమైతే సజీవంగానూ, లేకుంటే - ప్రాణం తీసైనా పట్టుకోవాలన్న పట్టుదలతో గురి చూసి దాని మీదకి బాణం వదిలాడు రాజు. ఆ బాణం దెబ్బకు విలవిలా కొట్టుకుంటూ ప్రాణం విడిచింది ఆ పంది.

నదిని ఎండగొట్టగలిగిన భాగం ఏదో దాని దేహంలో ఉండి ఉండాలని ఊహించిన శ్రీకాంతుడు- దానిని ముక్కలు ముక్కలుగా చేసి నీటిలో వేయసాగాడు. చివరికి... ఆ పంది పన్ను ఒకటి తగలగానే నీరు ఎండిపోయింది. ఆ పంటి సాయంతో తిరిగి నదిని దాటి, ఆ పంటిని భద్రపరిచాడు శ్రీకాంతుడు.

శ్రీకాంతుడి దగ్గర ఊహకి అందనంతటి ధనరాసులు ఉన్నాయి. బంగారం, వజ్రాలు, వైఢూర్యాలు, రత్నాలు... వంటివి లెక్కకి మిక్కిలిగా ఉన్నాయి. వాటిని స్వాధీనం చేసుకోవాలని అనేక మంది శత్రురాజులు కన్నేసి ఉంచారు.

వారికి అందుబాటులో లేకుండా ఆ నిధులను భద్రపరచాలనుకున్న శ్రీకాంతునికి ఒక ఆలోచన వచ్చింది. అడవి పంది పంటి సాయంతో సిందునందిలో కొంత బాగాని



ఎండగొట్టాడు అతను. అక్కడ పెద్దగోయి త్రవ్వి నేలమాళిగ కట్టి అందులోకి తన నిధులను రహస్యంగా తరలించి, దానిపైన ఎప్పటిలాగా నది ప్రవహించేటట్లు చేశాడు శ్రీకాంతుడు.

సింధు రాజ్యంలోనే విక్రముడు అనే మంత్రగాడు ఉండేవాడు. తన మంత్రశక్తితో అతను శ్రీకాంతుని నిధిరహస్యం తెలుసుకొని దానిని ఎలాగైనా కాజేయాలనుకున్నాడు.

ఒకసారి శ్రీకాంతుడు దేశాంతరం వెళ్లాడు.

ఆ అదను చూసుకొని విక్రముడు సాధువేశంలో శ్రీకాంతుని కోటలోకి ప్రవేశించాడు. సాధుసన్యాసులంటే అమితమైన భక్తిగల శ్రీకాంతుని కుమార్తె మోహిని- విక్రముడిని సాదరంగా ఆహ్వానించి సకల సపర్యలు చేసింది.

'తాను ఒక దీర్ఘవ్యాధితో బాధపడుతున్నాననీ.., భగవంతుడు కలలో కనిపించి శ్రీకాంతుని దగ్గర ఒక పంది దంతం ఉందనీ.., దానితో వైద్యం చేస్తే ఆ వ్యాధి తగ్గుతుందని చెప్పాడనీ.., అందుకోసం వచ్చా'ననీ చెప్పాడు. శ్రీకాంతుడు లేనందుకు విచారాన్ని నటించాడు.

ఆ మాటలు విని 'తండ్రి లేకపోయినా తాను ఆ సాధువు కోరిక తీరుస్తా'నని చెప్పి, మోహిని ఆ అడవి పంది దంతాన్ని వెతికి తెచ్చి విక్రమునికి ఇచ్చింది. అది తీసుకుని విక్రముడు శ్రీకాంతుని నిధిని రహస్యంగా తరలించుకుపోయాడు.

కొన్నాళ్ళకు తిరిగి వచ్చాడు శ్రీకాంతుడు. జరిగింది తెలుసుకొని అగ్గిమీద గుగ్గిలం అయిపోయాడు. వెంటనే వెళ్లి చూసుకుంటే నిధి చేజారిపోయింది.

జరిగిన మోసం తెలుసుకున్న మోహిని ఆ నిధిని తిరిగి సంపాదించుకొనిగాని ఇంటికి రానని శపథం పట్టి ఇల్లు వదలి బయలు దేరింది. అలా అలా వెళుతుండగా ఒక అడవిలో ఒక ముని ఆశ్రమం కనిపించింది. ఆ మునికి తన కథ చెప్పి తన శపథం నెరవేరేటట్లు అనుగ్రహించమని వేడుకుంది.

ఆ ముని తన దివ్యదృష్టితో జరిగిందంతా గ్రహించాడు.

"చూడు మోహినీ... మోసాన్ని మోసం తోటే జయించాలి. విక్రముడు మంత్రగాడు. అతన్ని జయించాలంటే... అంతకుమించిన మాయలూ, మంత్రాలూ నీవు నేర్వాలి.వాటిని నీకు నేర్పి సహాయం చేస్తాను" అన్నాడు ముని.

అన్నమాట ప్రకారం ముని – మోహినికి ఎన్నెన్నో మంత్రతంత్రాలూ, మాయలూ నేర్పాడు. తన మంత్రశక్తితో అద్భుతమైన ఒక కోటను నిర్మించి దానికి మోహినిని రాణిగా చేశాడు.

అతిత్వరలోనే ఆమె అంద చందాలు, భోగ భాగ్యాల గురించి దేశ దేశాల ప్రజలు చెప్పుకోసాగారు. ఆమెను పెళ్ళాడడానికి ఎందరో రాజకుమారులు రాసాగారు. కాని, ఆమె 'మంత్ర విద్యలో తనని జయించిన వారినే వివాహమాడుతా'నని పట్టుపట్టుకు కూర్చుంది.

ఈ సంగతి తెలిసి విక్రముడు ఆమె దగ్గరకు వచ్చాడు. తన శపథం నెరవేరే సమయం ఆసన్నమయినందుకు మోహిని ఎంతో సంతోషించింది.

మంత్ర పరీక్ష మొదలయింది.

"నేను ఒక పంది దంతంతో ఈ సింధు నదిని ఎండగొట్టగలను. నువ్వు చేయగలవా?" అని అడిగింది మోహిని.

"అదెంత పని..?" అంటూ తాను ఎత్తుకెళ్లిన పంది దంతంతో సింధు నదిని ఎండగొట్టాడు విక్రముడు.

"ఈ ఎండిన చోట నా నిధులనన్నిటినీ పూడ్చిపెట్టి తిరిగి నదిని పారించగలను. నువ్వు చేయగలవా!" అంది మోహిని.

వెంటనే తాను సంగ్రహించిన శ్రీకాంతుని నిధులనన్నింటినీ అక్కడికి జేర్చాడు విక్రముడు.

వెంటనే తన మంత్ర శక్తితో విక్రముడిని అచేతనుని చేసింది మోహిని.

అతడు దొంగిలించిన పంది దంతాన్ని తీసుకుని ఏడు సముద్రాల అవతల విక్రముడు ఎగిరి పడేటట్లు చేసింది మోహిని.

మరుక్షణంలో ముని అక్కడ ప్రత్యక్షమయ్యాడు. "మోహినీ, నీ శపథం నెరవేరింది. నేను గంధర్వ రాజును. నీ శపథం తెలిసి నీకు సహాయం చేయాలనే ముని వేషం వేసుకున్నాను. నన్ను వివాహమాడు!" అంటూ బ్రతిమాలాడు.

అందుకు సంతోషంగా ఒప్పుకుంది మోహిని.

గంధర్వుడు వెంట రాగా పంది దంతాన్ని తీసుకుని తండ్రి దగ్గరికి వెళ్లింది ఆమె.

★★★

